క్లుప్తంగా

మాలధారులకు సద్ది వితరణ



రెంటచింతల: పరమ పవిత్రమైన కార్తిక మాసంలో వివిధ స్వామి మాలలు ధరించిన మాలధారులకు సద్ది(అన్నదానం) వితరణ చేయడం ఎంతో పుణ్యమని వేదపండితులు జిగురు చంద్రశేఖర్‌శర్మ అన్నారు. బుధవారం స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవా సమితి మండపంలో రెంటచింతలకు చెందిన బచ్చు రాఘవేంద్ర 380 మంది మాలధారులకు అన్నదానం చేశారు. చంద్రశేఖర్‌శర్మ నేతృత్వంలో హోమాలు, అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరెడ్డి, అంబటి శ్రీనివాసరెడ్డి, కె.సైదులుస్వామి, కట్టమూరి శ్రీను గురుస్వామి, సోములు స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు. డిసెంబర్ 26 వరకు దాతల సహాయ సహకారాలతో మాలధారులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టినట్లు అయ్యప్ప సేవా సమితి కమిటీ సభ్యులు తెలిపారు.

రుద్రాభిషేకం



దాచేపల్లి: స్థానిక బోడ్రాయి సెంటర్‌లో లక్ష రుద్రాలతో అభిషేక పూజలు మంగళవారం రాత్రి జరిగాయి. కార్తికమాసం సందర్భంగా మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శివలింగానికి ప్రత్యేకంగా పూజలు చేసి రుద్రాభిషేకం చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు యరపతినేని నిఖిల్, తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, అక్కినపల్లి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు కరువు.. బతుకు బరువు

ఇసుక సంక్షోభంతో భవన నిర్మాణ రంగం కుదేలైంది. కార్మికులు ఐదు నెలల నుంచి ఉపాధి లేక కుటుంబ పోషణ భారంతో వలసల బాట పట్టారు. పనుల కోసం హైదరాబాద్, బెంగళూరుకు కుటంబంతో సహా తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇసుక పాలసీని మార్చి అందరికీ ఉచితంగా ఇస్తామని, సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని హామీనిచ్చింది. ఇసుకను అందుబాటులోకి తీసుకురాకుండా భవన నిర్మాణ కార్మికులను మోసం చేసింది. కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 10 వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్షంగా భవన నిర్మాణ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు.

- ఇసుక సంక్షోభంతో.. భవన నిర్మాణ రంగం కుదేలు
- పనులు లేక, అర్ధాకలితో కూలీల అవస్థలు
- నెలలో నాలుగు రోజులు కూడా పనులు దొరకని వైనం
- హైదరాబాద్, బెంగళూరుకు వలస వెళుతున్న కార్మికులు



ఇసుక లేక నిర్మానుష్యంగా ఉన్న అమ్మకం చేసే ప్రాంతం

మాచర్ల రూరల్: ఏ రోజు పనులు ఆ రోజు చేసుకొని కుటుంబాన్ని పోషించుకునే భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి ఇసుక కొరతతో దారుణంగా మారింది. కూలీల కడుపు తరుక్కుపోతుంది. పనులు కరువై బతుకు బరువైంది. వేకువజామునే నిద్రలేచి ఆశగా రోజూ వెళ్లే మెట్ట సెంటర్‌కు వెళ్లి పనికి పిలుస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తున్నా ఉదయం 11 గంటలు దాటినా పనులు దొరక్కపోవటంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు.

✦ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఎన్నికలకు ముందు ఇసుక పాలసీ మార్చి అందరికీ ఉచితంగా ఇసుక అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా ఇసుకను అందుబాటులోకి రాలేదు. ఉచిత ఇసుక దేవుడెరుగు.. అసలు ఇసుకే కనపించకుండా పోయింది. నియోజకవర్గంలోని ఐదు మండలాలు, పట్టణంలో సుమారు 10 వేల మందికి పైగా తాపీ వర్కర్స్, రాడ్ బెండింగ్, కార్పెంటర్, పెయింటర్స్, ఎలక్ట్రికల్, సీలింగ్, ప్లంబర్ తదితర కార్మికులు భవన నిర్మాణాల మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అందరికీ అందుబాటులో ఉన్న ఇసుక ఇప్పుడెందుకు అందటం లేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిల్వ ఉంచిన ఇసుక టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన గంటల్లోనే మాయం కావటం విశేషం.

గతంలో రూ.900.. నేడు రూ.1500

భవన నిర్మాణ రంగంలో ఇసుకదే ప్రధానమైన పాత్ర. ఇసుక లేనిదే నిర్మాణ రంగం ముందుకు నడవదు. ఐదు నెలల నుంచి ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది. వైఎస్సార్ సీపీ పాలనలో టన్ను రూ.900కు అందజేస్తే నేడు రూ.1,500కు కొనుగోలు చేయాల్సి వస్తుందని, అలాగే ట్రాక్టర్ ఇసుక గతంలో రూ.4,000 ఉండగా, నేడు రూ.8,000 ఉందని భవన నిర్మాణ యజమానులు వాపోతున్నారు. ఇసుక సులభంగా దొరక్క, అధిక ధరలకు బ్లాక్‌లో కొనలేక భవన నిర్మాణాలు సక్రమంగా జరగకపోవటంతో కూలీలకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో ఇతర రాష్ట్రాలకు వలస బాట పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల ఖాతాలలో డబ్బులు జమ అయ్యేవి. నేటి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలేమో కానీ ఉపాధి కూలీ కూడా దొరక్క ఇబ్బంది పడుతున్నారు.



పని కోసం ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి



ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైంది. ఇసుక అందుబాటులో లేక అధిక ధరలకు కొనుగోలు చేయలేక యజమానులు ముందుకు రావటం లేదు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి సరైన ధరలో ఇసుక సరఫరా చేస్తే నిర్మాణ రంగానికి మళ్లీ పూర్వ వైభవం వస్తుంది.

– మందా సంతోష్, భవన నిర్మాణాల మేస్త్రి

కూటమి ప్రభుత్వం కార్మికులను మోసం చేసింది



ఎన్నికలకు ముందు ఇసుక పాలసీ మార్చి ఉచిత ఇసుక అందిస్తామని చెప్పి ఐదు నెలలవుతున్నా.. నేటికీ ఇసుక అందుబాటులోకి రాలేదు. కూటమి నేతలు బ్లాక్ మార్కెట్‌లో ఇసుకను విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. హామీలను నెరవేర్చటంలో ప్రభుత్వానికి శ్రద్ధ లేదు. నిర్మాణ రంగంలో ప్రధానమైన ఇసుక రవాణాలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కార్మికులు అర్ధాకలితో వలస బాట పడుతున్నారు.

– సయ్యద్ బాషా, భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇసుక లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వానికి ఎన్ని వినతి పత్రాలు అందించినా స్పందించటం లేదు. కార్మికులతో కలసి ఉద్యమించి ప్రభుత్వ నేతల కళ్లు తెరిపిస్తాం. ఇసుక బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి ఉచిత ఇసుక పాలసీని వెంటనే అమలు చేయాలి.

– ఎం.బాబురావు, సీపీఐ పట్టణ కార్యదర్శి

ఆస్తి పన్నులు వెంటనే చెల్లించాలి



కమిషనర్ వేణుబాబు

మాచర్ల : పురపాలక సంఘ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో ప్రతి ఒక్కరూ ఆస్తి, నీటి పన్నులు వెంటనే చెల్లించి సహకరించాలని కమిషనర్ వేణుబాబు కోరారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉందన్నారు. దీన్ని అధిగమించేందుకు ప్రజలు సహకరించి ఆస్తి, నీటి పన్నులను బకాయిలతో సహా చెల్లించాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి జరిగి ప్రజలకు మంచినీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలతో పాటు, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సహకరించాలన్నారు. మున్సిపాలిటీకి చాలా బకాయిలు ఉన్నాయని, వాటిని తీర్చేందుకు ప్రజలు సహకరించాలన్నారు.

దీపోత్సవం.. నేత్రపర్వం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని నాగన్నకుంటలోని శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయంలో కార్తిక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి కోటి దీపోత్సవం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువులు కరుణాకర్ ఆధ్వర్యంలో శ్రీశ్రీనివాస పద్మావతి బృందం కోలాట ప్రదర్శనతో భక్తులను అలరించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం రమణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీరుక్మిణీపురంలో పొలం పిలుస్తోంది

మాచవరం: పత్తి పంటలో మెగ్నీషియం లోపం కనిపిస్తుందని నివారణకు ఎకరానికి 10 కేజీల మెగ్నీషియం సల్ఫేట్‌ను చల్లుకోవాలని ఏవో కె.రామమ్మ అన్నారు. మండలంలోని శ్రీరుక్మిణీపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి, కంది, మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకునేందుకు రైతులు ముందుగా ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. పిడుగురాళ్ల పరిధిలోని లక్ష్మీగణపతి కాటన్‌మిల్లు, అమరలింగేశ్వర ఎంటర్‌ప్రైజెస్ పత్తి మిల్లులకు పత్తి కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. తేమ శాతం ఆధారంగా కొనుగోలు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు యాకుబ్, రైతులు పాల్గొన్నారు.

ఉన్నతంగా ఎదిగేందుకు విద్య దోహదం



బహుమతులతో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

దుర్గి: మండలంలోని స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం గ్రంథాలయాధికారి పి.వి. గోపి ఆధ్వర్యంలో జరిగిన 57వ వారోత్సవాలలో కొన్ని రోజులుగా వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన 37 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు చదువు ఎంతగానో ఉపయోగపడుతుందని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీడీవో శివప్రసాద్, రిటైర్డ్ ఎంఈవో కోట వీరయ్య చౌదరి, దాత గోళ్ల ఆంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు టి.లక్ష్మీనారాయణ, షేక్ అబ్బాసు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

రెంటచింతల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా ముగిసినట్లు గ్రంథాలయ అధికారి రాయపాటి రాజకిశోర్ బుధవారం తెలిపారు. ఈ వారోత్సవాలలో పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత వివరించడంతో పాటు విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించినట్లు తెలియజేశారు. చివరి రోజు డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు సామూహిక స్వీయ పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించడం జరిగిందన్నారు. వివిధ పాఠశాలల విదార్థులు ఈ గ్రంథాలయ వారోత్సవాలలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు

మాచవరం: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని స్కాలర్స్ ప్రిన్సిపాల్ జయకృష్ణ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో మహనీయులు, జాతీయ నాయకుల చరిత్రలు, చారిత్రక ఘట్టాలతో కూడిన ఎన్నో విశేషాలు గల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పుస్తక పఠనం వలన అక్షర జ్ఞానం పెంపొందుతుందని అన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, రాజు మాస్టారు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



బెల్లంకొండ: మండలంలోని కేతవరం గ్రామంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన వజ్ర లక్ష్మీనరసింహస్వామి స్వయంభు దేవాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొండపై నూతనంగా నిర్మించిన అమ్మవారి దేవాలయం దిగువ భాగంలో స్వామివారు వెలసిన స్వయంభు ఆలయం పునర్నిర్మాణ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు దేవదాయ శాఖ ఈఓ అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసన్న కుమారాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత గుదిబండ వెంకట సాంబిరెడ్డి శంకుస్థాపన చేశారు. త్వరితగతిన ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ సాంబశివారెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆసం నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కార్తిక మాస ప్రత్యేక పూజలు



బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వర దేవాలయంలో అన్నదానం



పాత మాచర్లలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో...



పాత మాచర్లలోని శివాలయంలో...

మాచర్ల : కార్తిక మాసం పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. జమ్మలమడక వెళ్లే రహదారిలో రామప్ప దేవాలయం, పాతమాచర్ల వాసవి కన్యకా పరమేశ్వరి, గంగా పార్వతి దేవాలయం, శ్రీమాతా అన్నపూర్ణేశ్వరి దేవాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సత్రశాలలో ..

సత్రశాల(రెంటచింతల): సర్వాంతర్యామి తత్వానికి ప్రతీకైన ఆ మహాదేవుడు శివుడికి ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం సందర్భంగా బుధవారం అతిపురాతన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. వేకువజాము నుంచే భక్తులు దేవస్థానం సమీపంలోని పవిత్ర కృష్ణానదిలో కార్తిక స్నానాలు చేసి దేవస్థానంలోని ధ్వజస్తంభం, తులసిచెట్టు, నవగ్రహాల మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అర్చకులు చిట్టేల మల్లిఖార్జున శర్మ నేతృత్వంలో స్వామి వార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించి గణపతి, రుద్ర హోమాలలో పాల్గొన్నారు. భక్తులకు, మాలధారులకు అన్నదానం చేయగా ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య, మున్నా లింగయ్య తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యం

వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్‌రెడ్డి



తుమ్మకోటలో పత్తి సాగులో తీసుకోవాల్సిన మెలకువలు వివరిస్తున్న ఏడీఏ జగదీశ్వర్‌రెడ్డి

రెంటచింతల: ఖరీఫ్‌లో వివిధ పంటలను సాగుచేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని మాచర్ల వ్యవసాయ సంచాలకులు వద్దుల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మకోట, పాలువాయి గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డితో కలిసి రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, సేంద్రియ ఎరువుల ప్రయోజనాలను తెలిపారు. వేసవిలో రెండు సార్లు లోతు దుక్కులు దున్ని ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసుకోవాలన్నారు. అజొల్లా, నీలి ఆకు పచ్చనాచు, అజోస్పైరిల్లమ్ లాంటి జీవన ఎరువులను పంటలకు ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. విత్తన శుద్ధి చేయడం, వ్యవసాయ అధికారుల సూచన మేరకు నత్రజని, భాస్వరం, పొటాష్, ఎరువులను వేసుకోవడం వలన తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగించడం వలన పెట్టుబడి పెరుగుతుందని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పిడుగురాళ్ల పట్టణ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... వాటర్ పంపింగ్ లైన్ గవిందాపురం, మోర్జంపాడు సబ్‌స్టేషన్ వద్ద ఏర్పడిన లీకులు బాగు చేయు కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు గాను 21, 22 తేదీలలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. తిరిగి 23వ తేదీ ఉదయం నుంచి నీటి సరఫరా చేయటం జరుగుతుందని చెప్పారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ధర్మవరంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు



దుర్గి: మండలంలోని ధర్మవరం గ్రామంలో వేంచేసియున్న హరిహర బాల నాగేంద్రస్వామి 34వ వార్షిక మహోత్సవం సందర్భంగా బుధవారం మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు చేతుల మీదుగా ఎడ్ల బండ లాగుడు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలు కాకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అండగా నిలబడుతుందన్నారు. అన్నదాతల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. దుర్గి మిర్చి యార్డులో రైతుల పంటను కొనుగోలు చేసేలా కృషి చేస్తామన్నారు. ధర్మవరంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తయ్యేలా చూస్తామన్నారు. ప్రతి రైతు పొలానికి సాగు నీరందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



దాచేపల్లి : ప్రజలకు అండగా ఉంటామని టిక్నో పెయింట్స్ అధినేత ఆకూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పలు వృద్ధాశ్రమాల్లో బుధవారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి భోజన వసతిని శ్రీనివాసరెడ్డి కల్పించారు. వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ఇతరుల పట్ల సానుకూల దృక్పథం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి సాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఆకూరి వెంకటరెడ్డి, ఆకూరి కాశీరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి, నాయకులు వణుకూరి రామకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, ఆకూరి సుధాకర్‌రెడ్డి, ఉయ్యూరు రాంబాబు, బొంతు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.